## విద్యార్థినిలకు కంటి అద్దాలు పంపిణీ

దువ్వూరు, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:



స్థానిక కస్తురబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు జాతీయ అంధత్వ నివారణలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు డాక్టర్ సురేష్ బాబు, హేమలతలు తెలిపారు. కస్తూరిబాల ముందుగా విద్యార్థినులందరికీ వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించామని వారిలో 42 మందికి కంటి అద్దాలు అవసరమైనట్లు గుర్తించామని అన్నారు. వారికందరికి కంటి అద్దాలను అందజేసినట్లు తెలిపారు. కంటి చూపు తగ్గకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కస్తూరిబా బాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకుడు చంద్రమౌళి, ప్రిన్సిపాల్ మల్లేశ్వరి, మాధవి లత, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 4 ప్రభాత వార్త



స్థానిక శ్రీరాముల పేట వీధిలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన క్యాన్సర్ బాధితుడైన గుర్రప్పను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి,ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టిడి వరుణ్ కుమార్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. గుర్రప్ప తనకు వచ్చిన స్వర పేటిక క్యాన్సర్ ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడం వలన సరైన చికిత్స, మనోధైర్యంతో జయించి ఆరోగ్యంతో జీవిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వ్యాధుల లాగే క్యాన్సర్లను కూడా నయం చేయవచ్చని అయితే వాటిని ప్రాథమిక దశలోనే గమనించి సరైన చికిత్సను పొందడం వలన ఎవరైనా క్యాన్సర్ ను జయించగలరని ఏ క్యాన్సర్ వ్యాధి కూడా ప్రాణాంతకం కాదని చెప్పారు. అలాగే ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్మన్ షేట్ గురివిరెడ్డి , కోటా ఓబులరెడ్డి, అధ్యాపకులు రమణ, నారాయణరెడ్డి, వేమ నారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

పోరుమామిళ్ళ రూరల్, జనవరి 4 ప్రభాతవార్త:



పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, టేకూరు పేట హైస్కూల్ లో చదువుతున్న 96 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాయడానికి అవసరమైన అట్టలు, పెన్నులు, పెన్సిల్లు వంటి సేష్టనరి, పౌచ్ లను బుధవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవడానికి పదో తరగతినే కీలక మెట్టు అని, మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, ప్రతినిధులు పి. శ్రీనివాస రెడ్డి, జయరాం, హరి పాల్గొన్నారు.

## పేకాట రాయలు అరెస్ట్

కలసపాడు, జనవరి 4 ప్రభాతవార్త:

మండలంలో విశ్వసనీయ సమాచారంతో బుధవారం పెండ్లిమర్రి గ్రామానికి చెందిన పేకాట ఆడుతున్నారని తెలుసుకొని రెండు చోట్ల ఆడుతున్న వారిని ఏడు మందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి దగ్గర రూ. 7500 దాకా డబ్బులు ఉన్నదని రెండు కేసులుగా నమోదు చేశామన్నారు. వారిని కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

## ప్రధాన రోడ్డు ఆక్రమణ సబ్ కలెక్టర్‌కు పిర్యాదు

సుండుపల్లె, ఫిబ్రవరి 04,ప్రభాతవార్త :

రాయవరం గ్రామం, మాచిరెడ్డి గారి పల్లి పంచాయితీ తొగురుపల్లి గ్రామంలో ప్రధాన రోడ్డు ఆక్రమణ వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన పోలిశెట్టి యర్రయ్య కుటుంబ సభ్యులు సుమారు 15-20 అడుగుల మేర ప్రధాన రోడ్డును ఆక్రమించి, ఇటీవల సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా రాతి కూశాలు నాటారని గ్రామస్తులు తెలిపారు. అలాగే మట్టి రోడ్డును కుదించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ భావనకు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. రోడ్డు అక్రమణకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

సదుం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా సదుము మహాత్మ గాంధీ జ్యోతిబా పూలె గురుకుల పాఠశాలలో 64 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. గతంలో కంటికి సంబందించిన సమస్య వున్నా పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో అవసరమైన 64 మంది విద్యార్థులకు బుధవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. పరీక్షల సమయం లో కంటి అద్దాలు పంపిణీ చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెరుకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చరణ్ అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జయ సింహా నాయుడు, ఆరోగ్య పర్యవేక్షణా సిబ్బంది నీలకంఠ, సికామని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రషీద్, ఆరోగ్యకార్యకర్త కల్యాణి, అర్షఫ్, ఆశ కార్యకర్త రమణమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం జుంజురపెంట వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాదల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వైకాపా మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర విలేకరులకు తెలిపారు. బుధవారం పెద్దేరు ప్రాజెక్టు లో జరిగిన గ్రామ కమిటీ ఎన్నిక లో వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆంజనేయులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సహకారంతో వైకాపా బలోపేతంతో పాటు కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలా కోటిరెడ్డి, రాయల్ భవన్ మల్లికార్జున, కొటాల కుమారి, ఎంపీటీసీ రామకృష్ణ, చలపతి నాయుడు, రామాంజనేయులు, శ్రీధర్, చెంద్రాయుడు, ఎద్దుల వారి కోట మధు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణం కమనీయం.. భక్తజన సందడి

పులివెందుల, ఫిబ్రవరి 4, ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వెలసిన శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి సమేత ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, కమనీయంగా నిర్వహించారు.ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరగగా, కళ్యాణ మహోత్సవాన్ని దర్శించుకు నేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మర ణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఈ సందర్భంగా బీవీఎస్ఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత బీవీ సుబ్బారెడ్డి వారి సోదరుల ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు హరి రాజా, సుబ్బయ్య, శ్రీనివాసులు, కర్ణాకర్‌తో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణ,విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆర్థిక చేయూత నివ్వండి







బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త :

జాంబవంతనగర్‌లోని కోదండ రామాలయాన్ని నిర్మాణం విగ్ర ప్రతిష్టకు బద్వేల్ ప్రాంత ప్రజలు, నాయకులు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకారాలు అందజెయాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు, బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కాలువ నాగేంద్రబాబు, కాలనీవాసులు మాట్లాడుతూ దాదాపు 70 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నామని, తమ కాలనీలో పండుగలు, ఉత్సవాలు దైవ కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు గాను 2011లో శ్రీ కోదండ రామస్వామి దేవస్థానాన్ని నిర్మించాలని తలచి కాలనీవాసులు చందాలు పోగుచేసుకొని బేసుమట్టం, గోడలు,గర్భగుడి, మండపానికి స్లాబు వేసుకొని ఆర్థిక వనరులు లేక దేవస్థాన నిర్మాణ పనులు నిలిచిపోయి, సరైన వసతి సౌకర్యాలు లేక దీనస్థితిలో కార్యక్రమాలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు దేవస్థానం పూర్తి నిర్మాణమునకు, దైవ కార్యక్రమాలను ప్రచారం చేయుటకు మైక్ సెట్ మరియు స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంకు దాదాపు పది లక్షల అవసరం ఉన్నది. శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధి కొరకు వల్లంకొండు వెంకటరమణ, కె వి సుబ్బారావు, చెన్నంపల్లె రామకోటి రాజు, పెద్ది సుధాకర్, బ్రహ్మదేవుని యర్రం రెడ్డి, పబ్బతి చంద్రశేఖర్, ఈగ సుబ్బారెడ్డి, బత్తల సునీల్ కుమార్, సివినాగేశ్వరరావు, పెద్దినేని వీర కామేశ్వర రావులతో పాటు కాలనీ పెద్దలు కమిటీగా ఏర్పడి పలువురి దాతలను సంప్రదించగా కొంతమంది దాతలు ముందుకు వచ్చారని అలాగే ఈ దైవ కార్యక్రమం పరిపూర్ణం కావాలంటే మరి కొంతమంది దాతల సహకారం అవసరం ఉన్నదని కావున బద్వేలు పట్టణం, నియోజకవర్గ స్థాయిలో ఉన్న హిందూ బాంధవులందరూ శ్రీ జాంబవంత నగర్ ఎస్సీ కాలనీలో ఆలయ నిర్మాణ,విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలకు తోడ్పాటు అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఆలయ పైన ఉన్నటువంటి విద్యుత్ తీగలను తొలగించాలని పలువురి కమిటీ సభ్యులు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రితేష్ రెడ్డిని కలిసిన వెంటనే సంబంధించిన విద్యుత్ లైన్మెన్లు రమేష్, చంద్ర, విద్యుత్ కాంట్రాక్టర్ శ్రీరాములు రెడ్డి ఆలయం పైన ఉన్నటువంటి విద్యుత్ వైర్లను పరిశీలించారు, రెండు రోజుల్లో విద్యుత్ తీగలరని తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది, ఇందుకు సహకరించిన రితేష్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రాయలసీమ ద్రోహి జగన్ రెడ్డే

ఒంటిమిట్ట ఫిబ్రవరి.04 (ప్రభాతవార్త )



ఒంటిమిట్ట ఏపీ టూరిజం హోటల్ నందు బుధవారం మండల స్థాయి టిడిపి నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి చమర్తి. జగన్మోహన్ రాజు హాజరయ్యారు. సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ .జగన్మోహన్ రెడ్డి రాయలసీమకు ద్రోహం చేశాడన్నాడు. గతంలో ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ అభివృద్ధిని పట్టించుకోని జగన్ రెడ్డి నేడు దొంగ దీక్షలు ప్రారంభిస్తున్నాడని అసలు సిసలైన సీమ ద్రోహి జగన్ రెడ్డి అని తెలియజేశాడు. రాయలసీమలో కరివే లేకుండా ఉండేందుకు అప్పుడు అన్నగారు చర్యలు ప్రారంభిస్తే నేడు చంద్రబాబు నాయుడు పూర్తి చేసి సార్థకం చేశాడని తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగిరి, వెలుగోడు, కేసీ కెనాల్, ఎస్ ఆర్ టి ఎస్ పలు ప్రాజెక్టుల అభివృద్ధి వెనుక చంద్రబాబు సంకల్పం ఉందన్నాడు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యకర్తలు అధైర్య పడవద్దు

ముద్దనూరు, ఫిబ్రవరి 04,ప్రభాతవార్త:



మండల అధ్యక్షురాలు 2 ఎన్నికలలో వైసిపి ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా జెడి ఇంద్రాణిని ఎన్నుకున్న సందర్భంగా బుధవారం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలలో నియోజకవర్గ వైయస్సార్సీపి ఇన్చార్జి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి ఎంపీపీ అభ్యర్థి వెన్నపూస పుష్పలతను, జెడి ఇంద్రాణిని ఎంపీటీసీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్సీపి కార్యకర్తలపై నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనయించడం సరైన పద్ధతి కాదని, ఎంతో ప్రతిష్టాత్మకమైన తిరుమల ఆలయ కీర్తిప్రతిష్ఠాలను దెబ్బతీసే విధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం అవలంబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సి మెంబర్ గిరిధర్ రెడ్డి,మండల ఎంపీపీ వెన్నపూస పుష్పలత, వైస్ వైస్ ఎంపీపీ జేడీ ఇంద్రాణి, మండల వైసిపి అధ్యక్షులు శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు, వైసిపి నాయకులు మణికంఠ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయం చైర్మన్గా గురువారెడ్డి

పెద్దమండెం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా సర్కిల్ జిల్లా గ్రంథాలయం చైర్మన్గా గురువారెడ్డిని ప్రభుత్వం నియమించడం ఆనందంగా ఉందని జిల్లా ఎస్టి సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ అన్నారు గురువారెడ్డి టిడిపిలో కార్యకర్త స్థాయి నుండి పార్టీ అధికార ప్రతినిధిగా సేవలందించారు ఈ సేవలను గుర్తించి ప్రభుత్వం గురువారెడ్డిని గ్రంథాలయ చైర్మన్ గా నియమించడం జరిగిందన్నారు గత ప్రభుత్వం గురువారెడ్డి పై 24 కేసులు పెట్టిందని అయినా ధైర్యంతో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు ఈ కార్యక్రమానికి శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తిరుపతి తిరుపతి జిల్లా అధ్యక్షులు అనబాక లక్ష్మి టిడిపి ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి దారు నాయక్ అభినందించారు

## వైద్య సిబ్బంది ర్యాలీ..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఫిబ్రవరి 4 తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరములు దాటిన ప్రతి ఆడ, మగ వ్యక్తులకు ఉచితంగా మీ ఇంటి వద్దకు వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకొని క్యాన్సర్ బాధనుండి తగ్గించుకోవచ్చని,బి.మఠం పిహెచ్సి లో క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పుష్పరాజ్,హెల్త్ అసిస్టెంట్ మాధవనాయుడు,వెంకటరెడ్డి,ఎంపీహెచ్ఏ వీర జోత్స్న,విజయలక్ష్మి,ఏఎన్ఎం లు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

పీలేరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలన్న రద్దుచేసి లేబర్ కోట్లు ప్రవేశపెట్టి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నాన్ని ఈనెల 12న చేపట్టే సమ్మెతో తిప్పి కొట్టాలని ఏపీ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. వెంకట్రామయ్య తెలిపారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్లతో కలిసి లేబర్ కోడ్స్ రద్దు కొరకు దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఫిబ్రవరి 12 భాగస్వామి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పీలేరు యూనియన్ అధ్యక్షులు ,బివి రమణ ,ప్రధాన కార్యదర్శి ఆరు ఓబులయ్య జిల్లా కమిటీ సభ్యులు పులి రెడ్డప్ప రమేష్ సరోజ సంధ్య అశోక్ సుబ్బలక్ష్మి ్ సుహేల్ పద్మావతి కార్మికులందరూ పాల్గొన్నారు

## ఈశ్వరి దేవి మఠం లో వేలం పాటలు..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:

శ్రీ జగన్మాత ఈశ్వరీదేవిమఠం నందు దేవాదాయ శాఖ అధికారి శంకర్ బాలాజీ గారి ప్రత్యేక పర్యవేక్షణలో భక్తులు గ్రామస్తుల సమక్షంలో బుధవారం జరిగిన కొబ్బరి చిప్పలు సేకరణ హక్కుకుగాను రూ.2,60,000 రూపాయలు పాదరక్షలు భద్రపరచుటకు హక్కుకుగాను రూ.18,000 రూపాయలు మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్వహణ, రుసుము వసూలు చేసుకొను హక్కుకుగాను 1,77,000 రూపాయలు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు గాను 3500 రూపాయలు పై వేలంపాటల ద్వారా మొత్తం 4,58,500 రూపాయలు మఠమునకు ఆదాయం వచ్చినదని శ్రీ ఈశ్వరీదేవిమఠం కార్యనిర్వాహణాధికారి శ్రీ బివి జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

## విద్యుత్తు అంతరాయం

తొండూరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :

స్థానిక తొండూరు గ్రామంలో గురువారం ఉదయం 09.30 గంటల నుండి మధ్యాహ్నం 12:00గంటల వరకు 11కెవి తొండూరు టౌన్ ఫీడర్ లైన్ సిట్టింగ్ కారణంగా 33/11కెవి తొండూరు సబ్ స్టేషన్, పరిధిలోని తొండూరు గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది మరియు ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 14:00గంటల వరకు 11కెవి మదూరు టౌన్ ఫీడర్ , సైదాపురం లిఫ్ట్ ఇరిగేషన్ లైన్ షిఫ్టింగ్ కారణంగా 33/11కెవి మదూరు , పరిధిలోని మదూరు, సైదాపురం కృష్ణం గారి పల్లి గుండ్లమడుగు తేలూరు మరియు తుమ్మలపల్లి గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది .దయచేసి ప్రజలు మరియు రైతులందరూ సహకరించవలసినదిగా కోరుతున్నాను అని విద్యుత్ ఏఈ వి.బాలసంజీవులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## ఘనంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

పీలేరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



మద్యం, ధూమపానం, జంక్ ఫుడ్ తీసుకోవడం, పోషక ఆహారం లోపంతోనే క్యాన్సర్ మహమ్మారి ప్రబలుతుందని వైద్యులు తెలియజేశారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సిబ్బంది, కూటమి శ్రేణులు, విద్యార్థిని విద్యార్థులు నాలుగు రోడ్ల కూడలి నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు క్యాన్సర్ పై ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని నివారించడానికి కొత్తగా ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, ఉచిత చికిత్స అందించడం, అవగాహన కల్పించడంవాటి పై ప్రత్యేక చర్యలు చేపట్టడం లాంటి కార్యక్రమాలు ఉన్నత ప్రభుత్వం చేపడుతుందన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి బాబు రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, మాజీ మండల అధ్యక్షులు ఎన్ అమర నాథ రెడ్డి,అంకాలమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణ రెడ్డి,ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు.చిన్న,షమ, బుజ్జు, షాజాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ వైద్యులు చంద్రశేఖర్, ఈశ్వర్ సురేంద్ర,, రాజా సాహెబ్,వెంకటేష్, మెడికల్ అంకాలజిస్ట్, శ్రీనివాస్ గుప్తా, మమత లక్ష్మీ శ్రీనివాస్ వి.రామ్మోహన్ రెడ్డి, నౌమన్, రేడియోషన్ అంకాలజిస్ట్,దీతీళి ఆసుపత్రి రామకృష్ణా రెడ్డి,్బ్రు లోకేష్,గోపి కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు..

సుండుపల్లి, ఫిబ్రవరి0 3 ప్రభాతవార్త:



రాయచోటి హనుమాన్ జంక్షన్ నుండి ఆగిపోయినటువంటి డబల్ రోడ్డు పనులను రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అభివృద్ధికి నోచుకోని సుండుపల్లి మండలాన్ని తిరిగి అభివృద్ధి దిశగా పరుగులు తీయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని ఇన్చార్జి మంత్రిగా ఉన్న బీసీ జనార్ధన్‌రెడ్డి చనువుతో మనకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు వస్తున్నాయని యు, రాయచోటి హనుమాన్ జంక్షన్ నుండి జీకేరాచపల్లె వరకు ఉన్నటువంటి రోడ్డు మరమ్మతులు బ్రిడ్జిలు మినహాయించి మార్చి ఆఖరి లోపల పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మండల టి డి పి అధ్యక్షుడు రమేష్ నాయుడు, రామనాథరెడ్డి, శివరాం నాయుడు,ఎస్ ఐ హుస్సేన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమౌళి, రామశ్రీనివాస్, రాయవరం రఫిక్, కూటమినాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రయోజనాల కోసం కృషి

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :



మరణించిన మాజీ సైనికుల కుటుంబాలకు రావాల్సిన ప్రయోజనాల కోసం కృషి చేస్తానని డివిజన్ మాజీ సైనికులు, వీర మహిళల అసోసియేషన్ ప్రెసిడెంట్ నేట్ల బాల వీరారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు నందు మాజీ సైనికుడు రమణ రాజు అనారోగ్య కారణాల వలన మరణించడంతో అతని అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ తరపున అధ్యక్షుడు నేట్ల బాల వీరా రెడ్డి,సెక్రటరీ శంకర్ రెడ్డి, అడ్వయిజరు నెల్సన్, మాజీ సైనికులు మరియు వీర నారీ మణులు, బంధుమిత్రాదులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతి చెందిన మాజీ సైనికుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్ని బెనిఫిట్స్ తొందరగా తెప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నేట్ల బాల వీరా రెడ్డి, సెక్రటరీ శంకర్ రెడ్డి, అడ్వయజరు నెల్సన్, మెంబర్స్ సింగమ్ శివా రెడ్డి, కుమ్మటి కేశవరెడ్డి, సహదేవ రెడ్డి, యంవీ రమణయ్య, శ్రీనివాసులు, సహదేవ రెడ్డి, కే యం షరీఫ్, సుబ్బరాయుడు, బాల నాగిరెడ్డి, జీయన్ గురివిరెడ్డి, బాబు, గంగిరెడ్డి, విజయకుమార్, రామ క్రిష్ణయ్య, కాస కేశవరెడ్డి, శివ కుమార్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## ఉచితంగా కంటి అద్దాలు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 4 ప్రభాత వార్త



పట్టణంలోని వైవిఎస్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 105 మంది బాలికలకు ఉచిత కంటి అద్దాలు శాసనసభ్యులు వరదరాజులు రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ స్కూల్లో చదువుతున్నటువంటి పేద మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచిత పరీక్షలు, కంటి అద్దాలు ఇవ్వడం వలన పిల్లలందరి కంటిచూపు మెరుగవడమే కాకుండా వారి కుటుంబాలకి ఆర్థిక భారం తగ్గించినట్లు అవుతుందన్నారు, డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గీతా మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకోవడంతో పాటు నిత్యం వ్యాయామం చేసుకుంటూ క్రీడలు ఆడుకుంటూ స్మార్ట్ ఫోన్స్ కి దూరంగా ఉండాలని అలాగే ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన అద్దాలని సక్రమంగా వాడాలని కోరారు,

## మోటారు సైకిల్ చోరీ కేసులో బాలుడిపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:

చిన్నచౌకు పీఎస్ పరిధిలో మోటారు సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఒక బాలుడిని పోలీసులు కేసు నమోదు చేసి ఒక రోజులోనే చాకచక్యంగా ఛేదించి అదుపులోకి తీసుకొని జువైనల్ హోంకు చిన్నచౌకు పోలీసులు తరలించారు. కడప వివేకానందనగర్‌లో హోండా యాక్టివా, మారుతీనగర్‌లో మరో హోండా యాక్టివాను చోరీ చేశాడు. బుధవారం ఉదయం కడప రింగ్ రోడ్డులో గల దేవుని కడప ఆర్చ్ సమీపంలో సదరు బాలుడిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్ ఓబులేసు పర్యవేక్షణలో ఎస్సై రాజరాజేశ్వరరెడ్డి, తమ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు వేణు శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుసేన్, ప్రదీప్, సుధాకర్ యాదవ్ సహాయంతో కేసు ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## గ్రామాల అభివృద్ధికి పన్నుల వసూలే కీలకం

మదనపల్లె, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:




గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఆర్థిక వనరులు అత్యంత అవసరమని, అందులో భాగంగా పన్నుల వసూలు లక్ష్యానికి అనుగుణంగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్.సుధాకర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాల్ లో డీపీఓ రాధమ్మ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పన్ను వసూళ్లు, శానిటేషన్ నిర్వహణ, పీ3 విధానం అమలుపై డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూలులో అలసత్వం వహిస్తే గ్రామాభివృద్ధి నిలిచిపోతుందని, పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం-1995, జీఓనెం.30, రూల్‌నెం.26లో పేర్కొ న్న విధంగా జప్తు అధికారాన్ని ఉపయోగించి సులభమైన కార్యక్రమంగా పన్ను వసూళ్లు చేయాలన్నారు. బకాయి పన్నులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ తిరిగి వసూలు చేయాలన్నారు. పీ3 విధానం అమలులో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీ రాజ్ సిబ్బందికి అవార్డుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, అమరనాథరెడ్డి, డీఎల్‌పీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సదుం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

మండల పరిధిలోని రౌడీషీటర్లకు మదనపల్లి డీఎస్పీ మహేంద్ర బుధవారం సదుము పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవడం గొప్ప విషయం అన్నారు. సంఘ వ్యతిరేకంగా ఎవరూ పని చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరూ మార్పు చెందాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి క్రైమ్ రేట్ ను తెలుసుకున్నారు. ఆయన వెంట సీ ఐ సాయిప్రసాద్, ఎస్ ఐ విష్ణు నారాయణ పాల్గొన్నారు.

## గుంటి వేణుగోపాల్ పిలుపు

వేంపల్లి:ఫిబ్రవరి 04(ప్రభాత వార్త)

ఈనెల 22వ తేదీన కడపలో జరుగుతున్న ఏఐటియు సి కడప జిల్లా12వ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. వేంపల్లి మండలం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 105 సంవత్సరాలుగా నిరంతరం కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న దేశంలోని ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని హమాలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్విరామంగా పోరాటాలు నిర్వహిస్తున్న ఎఐటియుసి జిల్లా మహాసభలు ఈనెల 22వ తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని జిల్లాలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు శోభారాణి, మమత, గౌతమి, పార్వతి ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్కే వ్యాలీకి జాతీయ గుర్తింపు

వేంపల్లె ఫిబ్రవరి 04 (ప్రభాత వార్త)



చెన్నై ఐఐటీ మద్రాస్ లో నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్"ఇంటరాక్షన్ విత్ స్టార్‌లు" కార్యక్రమంలో ఈఈఈ విభాగంలో అత్యధిక ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్లు సాధించినందుకు ఆర్జీయూకేటీ-ఆర్కే వ్యాలీ క్యాంపస్‌కు ప్రతిష్టాత్మక ఎన్‌పీటీఈఎల్ ట్రోఫీ లభించింది. ఈ ఘనతతో విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్ (అకడమిక్స్) డా.రమేష్ దౌండ్కర్ ఎస్పీఓసీగా పాల్గొని, స్టార్ కేటగిరీలో మూడు ఎన్‌పీటీఈఎల్ స్టార్ అభినందన సర్టిఫికెట్లు అందుకున్నారు. అలాగే సీఎస్‌ఈ విభాగానికి చెందిన అధ్యాపకుడు సత్యానంద రామ్ నందిగం తన అకడమిక్ ప్రతిభకు గుర్తింపుగా ఎన్‌పీటీఈఎల్ స్టార్ అభినందన సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమార స్వామి గుప్త, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పెనుగొండ రవి కుమార్, ఈఈఈ విభాగాధిపతి ఏ. శ్రీకాంత్ రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డా. సుధాకర్ రెడ్డి, అసోసియేట్ డీన్ నవీన్ కుమార్, భాస్కరయ్య లు హర్షం వ్యక్తం చేస్తూ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

## కాన్సర్ రహిత సమాజం నిర్మిద్దాం

పులివెందుల ఫిబ్రవరి 4 ప్రభాత వార్త :

పొగాకు, ప్లాస్టిక్ రహిత ఆహారాలతో కాన్సర్ నియంత్రణ సాధ్యం అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రముఖ సర్జన్ వైద్యులు సుకన్య పేర్కొన్నారు. ప్రపంచ కాన్సర్ దినం సందర్భంగా పులివెందుల పట్టణం లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1!!2 మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినిలకు కాన్సర్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకన్య మాట్లాడుతూ కాన్సర్ వచ్చే మార్గాలు, కాన్సర్ గుర్తించే పద్ధతులు, కాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాన్సర్ నియంత్రణ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ,ఎన్ఎస్ఎస్ యూనిట్ 1!!2 ప్రోగ్రామ్ అధికారులు శ్రీ నిత, శ్రీనివాసులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**పొరుగు సేవల ఉద్యోగ ప్రకటన**

కడప జిల్లా నందు పొరుగు సేవల పద్ధతిలో పనిచేయుటకు ఈ కింద తెలిపిన సిబ్బంది కావలెను

1) 132 KVSS Balapanur

High Skilled : Diploma in Electrical Engineering Roster: OC (PH(W)(VH)

2) 132 KVSS BCL

SKILLED : ITI Electrical Roster: Bc-E (W)

నిబంధనలు: 1 వయస్సు 18 నుండి 35 సంవత్సరములు (ప్రకటనతేదీ దినము వరకు ).

2. అభ్యర్థులను పూర్తిగా మెరిట్ ఆధారంగా తీసుకొనబడును.

3). అభ్యర్థులను మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో పరిగణించబడును.

4). అభ్యర్థులు 132కెవి విద్యుత్ ఉపకేంద్రము నందు ఏ మేరకు విధులు నిర్వర్తించగలరు అన్న నిర్ణయం తీసుకొనుటకు మరియు వారిని ఎంపిక చేయుటకు లేదా తిరస్కరించుటకు గాని కాంట్రాక్టర్ వారికి పూర్తి అధికారం ఉండును.

5). పైన తెలిపిన ఖాళీలు తాత్కాలికం మాత్రమే వాటిని భర్తీ చేయుటకు గాని, మార్పు చేయుటకు గాని పూర్తి రద్దు చేయటం గాని అధికారం ఉండును.

6). అభ్యర్థులు వారి బయోడేటా తమ ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్ కార్డు తమ సంబంధిత తాసిల్దారు వారిచే 6 నెలలలోపు జారీ చేయబడిన కుల మరియు నివాస ధ్రువీకరణ పత్రాలు జత చేయవలెను.

7) కవరు పైన ఏ ఉద్యోగమునకు ఏ విద్యుత్ ఉపకేంద్రమునకు దరఖాస్తు చేస్తున్నారో కనబరుస్తూ షీల్డ్ కవర్ ద్వారా, THE CIRCLE INSPECTOR, A.P.T.S. Office of the, SE/Operation/A.P.S.P.D.C.L., Kadapa 516002 A.P.

13-02-2026వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపల దరఖాస్తులు చేరవలెను సమయం దాటి వచ్చిన వాటినీ ఎటువంటి పరిస్థితిలో స్వీకరించబడవు.

ముఖ్య గమనిక: సర్టిఫికెట్లు జతపరచని, పై నిబంధనలు పాటించని వారి దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబడవు.

మేనేజింగ్ డైరెక్టర్, SN Constructions, Kadapa

# రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ కపట ప్రేమ...

**పీలేరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**

అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల్లో రాయలసీమ నీటి ప్రాజెక్టులను పట్టించుకోని జగన్ నేడు దీక్షల పేరుతో డ్రామాలకు తెరదీశారు. జగన్ ఐదు సంవత్సరాల కాలంలో రాయలసీమలో నీటి ప్రాజెక్టుల కోసం కేవలం రెండు వేల కోట్లు ఖర్చు పెట్టారు, కానీ 2014 19 చంద్రబాబు హయంలో12011 కోట్లు, గడిచిన 19 నెలల కాలంలో దాదాపు 8 వేల కోట్లు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు 1983లో రామారావు రాయలసీమ కరువు నుంచి కాపాడడం కోసం తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, కేసీ కెనాల్, అవుకు ఎస్ఆర్బిసి, వెలిగొండ రిజర్వాయర్, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుల వెనక ఎన్టీఆర్, చంద్రబాబు కృషి ఎంత ఉంది.3870 కోట్లతో హంద్రీనీవాని పూర్తి చేసి 190 రోజుల్లో 40 TMCల నీటిని తరలించి ఆరు లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడం జరిగింది, కూటమి ప్రభుత్వంలో దాదా అన్ని ప్రాజెక్టులు చెరువులు జలకళను సంతరించుకున్నాయి 464 TMC ల సామర్థ్యం గాను నేడు 366 టీఎంసీల నీటితో నిండి ఉన్నాయి చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనం, రాయలసీమ లో 17 మేజర్ ప్రాజెక్ట లు ,39 మైనర్ ప్రాజెక్టుల లో 84 శాతం నీటి నిలువ ఉన్నవి. అనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రిజష్ కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ రాసి కృష్ణాజిల్లాల మిగులు వాట అడగబోమని రాయలసీమ ప్రాంతం వారికి అన్యాయం చేశారు. జగన్ కెసిఆర్ తో లాలూచీ పడి కృష్ణా జలాల విషయంలో వినిపించకుండా అన్యాయం చేశారు, తుంగభద్ర డాం నిర్వహణకు నిధులు ఇవ్వకుండా గేట్లు కొట్టుకోవడానికి కారణమయ్యారు, చంద్రబాబు ముందు చూపుతో సమయస్ఫూర్తి తో 40 టీఎంసీలు నీళ్లు వృధా కాకుండా మరమ్మత్తు చేయించ గలిగారు. అ లాగే గోదావరి నుండి 3000 టీఎంసీల సముద్రంలో కలిసిపోతున్న వాటిలో 200 టీఎంసీలు ఎత్తిపోతల పథకం ద్వారా రాయలసీమను సస్యశ్యామలగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంగమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ వాసునూరు చంద్రశేఖర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

## పీహెచ్‌సీ తనిఖీ

**నందలూరు, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**



జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమా మహేశ్వర్ రావు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఐఎల్ఆర్, డీప్ ఫ్రెజర్, అటెండన్స్ రిజిస్టర్, ఫార్మసీరూమ్, ల్యాబ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. నందలూరు, ఆడపూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్ వ్యాధిపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్‌ఓలు వెంకట నారాయణ, మునిరెడ్డి, పిహెచ్ న్ శైలజ, సూపెర్వైసర్ సునీల్ కుమార్, ఆరోగ్య సబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

**సిద్ధవటం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



గ్రామంలో చెంచులక్ష్మి కాలనీ యందు వైద్యురాలు రంగలక్ష్మి ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా మహిళలకు టీనేజ్ ఆడపిల్లలకు, ప్రజలకు క్యాన్సర్ గురించి వివరించడం జరిగినది. చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం వలన గర్భస్రావాలు జరిగి రక్తహీనత మరియు గర్భసంచి సరిగా ఎదుగుదల కాకపోవడం ఇలాంటి కారణాల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కనుక సరైన సమయంలో పెళ్లి చేసుకుంటే ఇలాంటి సమస్యల నుంచి కాపాడుకోవచ్చునని, పాన్ గుట్కా ఇలాంటివి తీసుకోవడం వల్ల నోటి క్యాన్సర్ వస్తుందని అలాగే ఎవరికైనా రొమ్ములలో ఏవైనా కనితలు లాంటివి ఉంటే మీరు ఆలస్యం చేయకుండా ఆరోగ్య కార్యకర్తలకు చెబితే పరీక్షలు చేసి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ సూపర్వైజర్ మోలాలి ఏఎన్ఎంస్ అంజనాదేవి శారద ఆశ పద్మజ భారతి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## దాడులు చేయడం హేయమైన చర్య

**కాశినాయన ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీద ఎప్పుడైనా దాడులు చేయడం వారి ఆస్తులను ధ్వంసం చేయడం నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం టిడిపి నేతలకు ఇది హేయమైన చర్య జిల్లాకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి ఎలిచెర్ల నాగ సుబ్బారెడ్డి ఖండించారు. మంగళవారం ఆయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడుదల రజిని ఇళ్లపై దాడి చేయడం, మహిళలు అని చూడకుండా అసభ్యకరమైన పదజాలాలతో పెట్రేగిపోవడం తెలుగుదేశం పార్టీ వారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయం రాజకీయంగానే ఉండాలి కానీ వ్యక్తిగతంగా ఉండకూడదని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ గమనించాలని ఇటువంటి వాటికి స్వస్తి పలకాలన్నారు.

## కేసులు నమోదు చేయాలి

### విద్యార్థి సంఘాలు డిమాండ్

**మదనపల్లె, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :**


నిరసన తెలుపుతున్న దృశ్యం

పట్టణంలోని బీసెంట్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ, యూఐ, ఏఐ ఎస్ఎఫ్, వైఎస్ఆర్ స్టూడెంట్స్ యూనియన్, డిబిఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో రౌడీషీటర్లుగా నమోదు చేయాలని వారి ఫోటోలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ యూనివర్శిటీలో జరుగుతున్న ఫీజుల దోపిడి దందాను విద్యార్థి సంఘాలు దశల వారీగా పోటారాలు నిర్వహిస్తుంటే ఆ పోరాటాలు ద్వారా ప్రభుత్వానికి 27కోట్లు విద్యార్థులు జమ చేయాల్సి వస్తుందని విద్యార్థి సంఘాల నాయకులను కిడ్నాప్ చేసి భయపెట్టి హత్య చేయాలని పథకం పన్నారన్నారు. ఇలాంటి యూనివర్శిటీపై రౌడీషీటర్లుగా గుర్తించి కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంపత్‌కుమార్, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ జిల్లా ఉపాధ్యఓఉలు నరేష్‌కుమార్, సాయికుమార, భాను, ఆఫ్రిద్, ప్రేమకుమార్, సంతోష్, బన్నీ పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాన్ని తనిఖీ

**రామసముద్రం పిబ్రవరి 4 ప్రభాతవార్త**



మండలం ఊలపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో 1 అన్నపూర్ణాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌తో పాటు ఇతర రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. సిబ్బంది విధులకు సమయపాలన పాటించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం భూసాని కురప్పల్లె నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు, ఆలాగే దిన్నిపల్లి ఎంపీపీ పాఠశాలలో కొనసాగుతున్న ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ 1 అన్నపూర్ణ దేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవనశైలి మార్పు వల్ల క్యాన్సర్ నివారించవచ్చు

**యర్రగుంట్ల ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:**



క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా చిలంకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బుధవారం డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవడం వల్ల క్యాన్సర్ నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగమన్ రెడ్డి, పార్వతమ్మ, సూపర్వైజర్ రవికుమార్, సుభద్రమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కంటి జబ్బుల పట్ల జాగ్రత్త వహించాలి

**కురబలకోట ఫిబ్రవరి 4 ప్రభాతవార్త.**



విద్యార్థులు కంటి జబ్బుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ కంటి వైద్య డాక్టర్. అర్జునరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం కురబాలకోట మండలం అంగళ్ హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లల్లో అందత్వ నివారణ కోసం ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు కంటి డాక్టర్ తెలిపారు. హైస్కూల్లో హైస్కూల్ కు చెందిన 44 మంది పిల్లలకు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశామని కంటి వైద్యులు తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ అంగళ్లై స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శెట్టి సీతారాం బాబు హై స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుల గణన చేపట్టాలి

**బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 04 ప్రభాతవార్త :**



స్థానిక జేవి భవన్లోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా సమితి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వి. వీరశేఖర్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దాదాపు 143 వెనకబడిన కులాలు ఉన్నాయి గత స్థానిక అస్తవస్థలలో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్లో జనగణలో కులగనన చేపట్టి కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. కులగనన జరగకపోవడం వల్ల ఏర్పడుతున్న నష్టాలు అపారమైనవి కులగణనను కేవలం జనాభా లెక్కలను పరిమితం చేయకుండా కులాల వారీగా ఆర్థిక రాజకీయ మరియు సామాజిక స్థితిగతులు సంపద పంపిణీ, అవకాశాల సమానత్వాన్ని తెలుసుకునే విధంగా సమగ్రంగా జరిపించాలని కోరారు. అవగాహన కల్పించడం కోసం ఈ నెల 8న కడప నగరంలోని బీసీభవన్‌లో సదస్సు నిర్వహించడం జరుగుతున్నది ఈ యొక్క సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాద్ రెడ్డి హాజరవుతున్నారు. బీసీ నాయకులు అందరూ ఈ సదస్సులో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ పట్టణ కార్యదర్శి బాలు ఏరియా సహాయ కార్యదర్శిలు పివి రమణ ఇమ్మానియేల్ జిల్లా సమితి సభ్యులు పడిగా వెంకటరమణ పొంగూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం

**చిన్నమండెం పిబ్రవరి 4 ప్రభాతవార్త:**



మండలం, బోనమల గ్రామం నందు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల సమస్యలను ఏమాత్రం పరిష్కరించకుండా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులతో కలిపి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నట్లు అందుకోసం ప్రతి గ్రామంలో పేదలు వ్యవసాయ కూలీలతో కలిపి గ్రామ మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు అనంతరం చిన్నమండెం మండల నాయకులు పండరయ్య రెడ్డి సుధాకర్ ల ఆధ్వర్యంలో బోనమల గ్రామ కమిటీనీ ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. అధ్యక్షులుగా పి రెడ్డి ప్రసాద్, కార్యదర్శిగా నరసింహులు, కమిటీ సభ్యులుగా రెడ్డిశేఖర్, రెడ్డి భాస్కర్, బాబు, రమేష్, లోకేష్‌లను ఎన్నుకోవడం జరిగింది.

## ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలన

**రామసముద్రం పిబ్రవరి 4 ప్రభాతవార్త**



మండలంలోని ఊలపాడు గ్రామ పంచాయతీ లోని దిన్నిపల్లె ఎంపిపి పాఠశాల లో బుధవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక శిబిరం ను ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఎంపిడిఓ 1 అన్నపూర్ణ దేవి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న ఆధార్ బయో మెట్రిక్ అప్ డేట్ ప్రక్రియలను సమీక్షించారు. సిబ్బంది తో ఆయన మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, ఎంపిడిఓ 1 అన్నపూర్ణ దేవి డిజిటల్ అసిస్టెంట్ మురళి ఉపాధ్యాయులు,ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగం ద్వారా పంట డిగుబడి అంచనా వేయవచ్చు

**యర్రగుంట్ల ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**



పంట కోత ప్రయోగం ద్వారా పంట డిగుబడి అంచనావేయవచ్చని జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. మండల పరిధి తిప్పలూరు గ్రామంలో సాగు చేసిన సైనగల పంటను బుధవారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం చేశారు. రైతు సాగు చేసిన సైనగల పంట 5.5 మీటర్ల విస్తీర్ణం లో పంట పంటకోత ప్రయోగం లో 5.600 కిలోల శనగ దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుజనా కుమారి రైతులు పాల్గొన్నారు.

## కల్తీ చేసిన పాపం వైకాపాదే

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ః**



వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని కల్తీ చేసిన పాపం వైకాపా నాయకులదేనని జనసేన సీనియర్ నాయకుడు మైఫోర్స్ మహేష్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీవారి లడ్డులో సిబిఐ ఇచ్చిన రిపోర్ట్ 35 వపేజీలో జంతువుల కొవ్వు కలిసినట్లు ఉందన్నారు. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన వైకాపా నాయకులకు పుట్టగతులు ఉండవని హిందూ భక్తులు పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదం అపవిత్రం చేసి వారి మనోభావాలు దెబ్బతీసిన వైకాపా నాయకులు పార్టీ కావాలో శ్రీవారు కావాలో తేల్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు ఉమేష్, రఘు, సురేష్, అరవింద్, రెడ్డప్ప, కార్తీక్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

## జిల్లా రైతులకు సాంకేతికత ఆధారిత అవకాశాలు

**పీలేరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త;**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యం జిల్లా రైతులకు మేలు చేసే విధంగా ఉందని ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధి షావలి అభిప్రాయపడుతున్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సుమారు రూ.1.62 లక్షల కోట్ల కేటాయింపులు చేయడం విశేషం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'భారత్-విస్టార్' అనే ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వేదిక ద్వారా రైతులకు వాతావరణ సమాచారం, పంటల సాగు సలహాలు, పురుగు-రోగ నియంత్రణ సూచనలు స్థానిక భాషలో అందనున్నాయి. దీని వల్ల సాగు ఖర్చులు తగ్గి, ఉత్పాదకత పెరిగే అవకాశముంది. మొత్తంగా, కేంద్ర బడ్జెట్ 2026-27 వ్యవసాయ రంగంలో సాంకేతికత, అనుబంధ రంగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై దృష్టి సారించినప్పటికీ, సంప్రదాయ పంట రైతులకు మరింత బలమైన మద్దతు అవసరమని బోధి షావలి అభిప్రాయపడ్డారు.

## రైతులకు సూచనలు సలహాలు

**మైదుకూరు, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**



మండలంలోని తువ్వపల్లి మరియు బసవపురం గ్రామాలలోని రైతులకు పంటలో వచ్చే సమస్యల పై సూచనలు, సలహాలు, పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా కె.స్వాతి మరియు సెరికల్చర్ వి.గుర్రప్ప పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సాగు చేసిన సజ్జ, మినుము, మొక్కజొన్న, నువ్వుల, వరి పంటల స్థితిగతుల గురించి, పంటలో వచ్చే సమస్యల గురించి రైతులతో చర్చించడం జరిగింది. ప్రస్తుతం రబీ పంట నమోదు, రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరూ తమ పరిధి లో ఉన్న గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేస్తారని వాటిలో మినుము, మొక్కజొన్న, సజ్జలు, మిరప, టమోటా, ఆకు కూరలు, రైతులు సాగుచేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంటను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లో నుంచి పడి వ్యక్తి మృతి

**మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త.**



ట్రాక్టర్‌లోంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి.కొత్తకోట మండలం, బండమీద కొత్తపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి(45), మమత దంపతులు గత కొన్నేళ్లుగా మదనపల్లె మండలం, బయ్యారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. శేఖర్ రెడ్డి బోరు బండి పనులకు వెళ్తూ జీవనం చేసేవాడు. తోటి స్నేహితులతో కలిసి బోరు ఫిట్ చేసే ట్రాక్టర్ లో ముదివేడుకు పనులకు వెళ్తుండగా మార్గమధ్యంలో ని ముదివేడు క్రాస్ వద్ద ట్రాక్టర్లో నుంచి అదుపుతప్పి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. దీంతో అతన్ని బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోని శ్రీనివాసపురం వద్ద మృతి చెందాడు. మృతుడికి కుమార్తె రమ్య, కుమారుడు శ్రీనాథ్ రెడ్డి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మరమ్మత్తు పనుల పరిశీలన

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



పురపాలక సంఘం పరిధిలోని 12వ ఎలక్షన్ వార్డులో ఇస్లాంపురం వీధిలో జరుగుతున్న పైప్లైన్ మరమ్మతు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రజలకు నీళ్లు వదిలే సమయాన్ని ఇంకొక గంట అదనంగా పెంచాలని అధికారులను కోరారు కొత్త పైప్లైన్ మార్చుట కొరకు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఎం ఈ, ఏఇలను కోరి ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలిపారు. నూతన పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు వార్డు పరిధిలో 14 లక్షల 75 వేల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో వార్డు ప్రజలకు మంచినీటి కొరత ఉండదని స్పష్టం చేశారు. పైప్లైన్ మరమ్మత్తు పనుల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల తీరుకు నిరసనగా బాస్‌నేత మౌనదీక్ష

### బుద్ధినికొండపై ఆంక్షలు తొలగించాలని డిమాండ్

**మదనపల్లె, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :**


దీక్ష చేపడుతున్న దృశ్యం

రాజ్యాంగ బద్దంగా పౌరులకు సంక్రమించిన నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారంటూ, పోలీసుల తీరుకు నిరసనగా భారతీయ అంబేద్కర్‌సేన(బాస్) వ్యవస్థాపకుడు పీటిఎం శివప్రసాద్ తన ఇంట్లోనే మౌనదీక్ష చేపట్టారు. దీక్ష విరమించిన తరువాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె రూరల్ మండలం అంకిశెట్టిపల్లి సమీపంలోని బుద్దుని కొండపై గత ఆరేళ్ళగా అమలు చేస్తున్న సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలు వెంటనే ఎత్తివేయాలని, భగవాన్ బుద్దిడి ప్రధాన విగ్రహం చుటూట ఏర్పాటు చేసిన ఇనుప ముళ్ళకంచెను తొలగించి, బుదిదని పూజలకు అధ్యాత్మిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ, బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మౌనదీక్ష పేరుతో నిరసన కార్యక్రమానికి బాస్, బుద్ద అంబేద్కర్ సమాజ్ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. అనుమతి కోసం మూడు రోజుల ముందే పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకొన్నా అనుమతి లభించలేదన్నారు. దీనికి నిరసనగా ఇంటోలనే మౌనదీక్ష చేపట్టడం జరిగిందన్నారు. కుల వివక్షతో దళితులు బుద్దిడి విగ్రహాలను ధ్వసం చేయించడమే కాక లక్షల రుపాయల పంచాయితీ నిధులు స్వాహ అవుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు తప్పుడు సమాచారం ఇచ్చి సిఐ, తహశీల్దార్‌లు తప్పుడు దోవ పట్టిస్తున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకొని బుద్దినికొండపై 163 నిషేధాజ్ఞలు తొలగించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టురమణ; చాట్లబయన్న, జివి.రమణ, గంగాధర్; రవిశంకర్, తలారి క్రిష్ణ తదితరుల నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

## అక్కపై తమ్ముడి వేటకొడవలితో దాడి

### -ప్రమాదస్థితిలో ఆరోగ్యం -కేసు నమోదు

**చౌడేపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**


చికిత్స పొందుతున్న గంగులమ్మ

అన్నం తింటున్న అక్కపై చిన్నాన్న కుమారుడు వేటకొడవలితో విచక్షణారహితంగా దాడి చేయగా ఆమె ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...మండలంలోని దిగువపల్లి పంచాయతీ యానాదిపాళెంకు చెందిన గంగులమ్మ(45)కూలీ పనులు చేసుకొంటోంది. సొంత చిన్నాన్న కుమారుడు నాగరాజ గంగాపురంలో మాంసపు దుకాణంలో పనిచేస్తున్నాడు. గంగులమ్మ భర్త మరణించడంతో ఒంటరిగా వుంటోంది. ఈ క్రమంలో తన సోదరుడి ఆస్తి తనకు ఇవ్వాలని పలుమార్లు నాగరాజ అడుగుతాడు. అయితే గంగులమ్మ తిరస్కరిస్తుంది. దీంతో కోపోద్రేకుడైన నాగరాజ మంగళవారం రాత్రి మద్యం సేవించినవాడై గంగులమ్మ ఇంటికి వెళ్ళి కొడవలితో ఆమెపై దాడి చేసాడు. ముఖం, చేతులు, తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు గంగులమ్మను 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తండ్రి బీరప్ప ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత జగన్‌కు లేదు

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులే కాకుండా ప్రధానంగా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైయస్ జగన్మోహన్ రెడ్డికి లేదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 2019 24 మధ్య ముఖ్యమంత్రి గా వున్న జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధిని, రాయలసీమ లో సాగునీటి ప్రాజెక్టులను అటకెక్కించారని విమర్శించారు. కానీ ప్రస్తుతం దాదాపు 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ఇంతవరకు అభివృద్ధి చేయడం లేదని, సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం దారుణమని మాట్లాడటం సరికాదన్నారు. అనుమతులు లేని ప్రాజెక్టులను చేపట్టి పనులు పూర్తి చేయలేని అసమర్థుడు జగన్ అన్నారు. 3500 కోట్లతో ప్రారంభించిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి అనుమతులు తీసుకోవడంలో జగన్ వైఫల్యం చెందారని విమర్శించారు అందుకే జగన్ పాలనలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోయిందని అన్నారు. తిరిగి రాయలసీమ ఎత్తిపోతల పథకం పై వైసిపి కల్లబొల్లి కబుర్లు చెబుతూ నిరసనలు వ్యక్తం చేయడం సిగ్గుచేటు అన్నారు. గత ప్రభుత్వం లో పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చిన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం త్వరలోనే పూర్తి చేయనుందని వివరించారు. అంతేకాక ప్రస్తుతం ప్రతి నీటి ప్రాజెక్టులో నేడు నీరు పుష్కలంగా వున్నాయని, పలు చోట్ల రైతులు రెండు పంటలు వేసుకుంటున్నారని స్పష్టం చేశారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అలజడి వాతావరణం సృష్టించడమే వైసీపీ వారి ధ్యేయంగా వుందన్నారు. కడప జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి జబీవుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం, పారిశ్రామికీకరణ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఏమని విమర్శించాలో తెలియని వైసీపీ నాయకులు కూటమి నాయకులను దూషిస్తూ పరిపాలన స్థంభించాలని యోచించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, పల్లా శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులు గంగమ్మతో సమానం, వారిని గౌరవిద్దాం : డిఎస్పీ

**చౌడేపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

శక్తిక్షేత్రం బోయకొండకు తరలి వచ్చే భక్తులు గంగమ్మతో సమానమనీ, వారిని గౌరవించాలని అన్నమయ్య జిల్లా మదనపల్లి డిఎస్పీ మహేంద్ర అన్నారు. శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయానికి వచ్చే యాత్రీకులపట్ల ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించడం, తాజాగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా కొండకింద మాంసపు దుకాణాలు నిర్వహించే యజమానులు, పనిచేసే కూలీలు, యాత్రీకులను తరలించే వాహన డ్రైవర్లతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. నిత్యం వేలాదిగా భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారన్నారు. దీనివల్ల అమ్మవారి ఆలయానికే కాకుండా పనిచేసేవారందరూ వారిపైనే ఆధారపడుతున్నారన్నారు. అలాంటి వారిపై ఎలాంటి చర్యలకు పాల్పడరాదన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్దుల జోలికి వెళ్ళరాదన్నారు. ఇకపై కొండకింద, పైన పనిచేసే ప్రైవేటు వ్యక్తుల ఆధార్‌లు, ఫోటోలు ఇవ్వాలనీ, పనికి వెళ్ళే ముందు వారి వివరాలను స్థానికంగా విధులు నిర్వహించే పోలీసులకు ఇవ్వాలన్నారు. ఎవరైనా ఇకపై చట్టవ్యతిరేక చర్యలు చేసినా, మద్యం సేవించి విధులలో వున్నా చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. పుంగనూరు రూరల్ సిఐ సాయిప్రసాద్, ఎస్ఐ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలింగ్ ఇస్తున్న డిఎస్పీ మహేంద్ర

## నూతన ఎస్ఐగా మధుసూదన్ రెడ్డి

**ముద్దనూరు, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:**

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్ఐగా మధుసూదన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ. మైనుద్దీన్ ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అవ్వగా కడప విఆర్ లో విధులు నిర్వహిస్తు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు.

## బ్రహ్మంగారి హుండీల ఆదాయం 31 లక్షలు

**బ్రహ్మంగారి మఠం ఫిబ్రవరి 04 ప్రభాతవార్త:**

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠము నందు మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆధ్వర్యంలో 65 రోజులకు గాను 8 హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కింపు చేయగా 30,94,989/ రూపాయల మొత్తము,బంగారము 7 గ్రాములు, వెండి 221 గ్రాములు వచ్చినట్లు దేవస్థాన మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. ఈ హుండీల లెక్కింపునకు కడప జిల్లా దేవ దాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర బాలాజీ హాజరైయ్యారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో భక్తులు సేవ సమితి మహిళలు పాల్గోనారు.



# సమాజంలో మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశాభివృద్ధి వేగవంతం

### రాజంపేట సబ్ కలెక్టర్ భావన

రాజంపేట, ఫిబ్రవరి4 ప్రభాతవార్త

సమాజంలో మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశాభివృద్ధి వేగవంతమవుతుందని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అభిప్రాయపడ్డారు. పట్టుదల, క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యాలు విజయానికి మూలస్తంభాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడాలంటే నైపుణ్యాలు, నాయకత్వం, విలువలు సమన్వయంగా ఉండాలని చెప్పారు. ప్రతి మహిళ తనలోని ప్రతిభను గుర్తించి నిరంతరం అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. బుధవారం అన్నమాచార్య యూనివర్సిటీలో మహిళా సాధికారతపై ఆమె తన అనుభవాలను పంచుకుంటూ విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా దిశానిర్దేశం చేశారు.నేటి ప్రపంచంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందన్నారు, ప్రతి రంగంలో మహిళలు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేసుకోవడం ద్వారా సమాజంలో మార్పును తీసుకురాగలమని సూచించారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమయపాలన, నిర్ణయాధికారం, సృజనాత్మకత వంటి లక్షణాలు ప్రతి విద్యార్థినిలో ఉండాలని చెప్పారు. నిరంతర విద్యాభ్యాసం, నైపుణ్యాభివృద్ధి ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని వివరించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడం కాలానుగుణ అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలోయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి, మహిళా సాధికారత విభాగ కోఆర్డినేటర్ డా. వి. మోనేశ్వరి, ఈఈఈ విభాగాధిపతి డా. పి. బాలచెన్నయ్య, ఈఈఈ మహిళా సాధికారత కోఆర్డినేటర్ ఎం. స్వాతి పాల్గొన్నారు.



# వెదురు సాగుపై రైతులకు ప్రోత్సాహలు

సిద్ధవటం ఫిబ్రవరి4 ప్రభాతవార్త

సిద్ధవటం మండల పరిధిలోని భాకరాపేట రైతు సేవా కేంద్రం యందు బుధవారం వెదురు సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమును బద్వేల్ ఉద్యాన శాఖ అధికారి జయ భారత్ రెడ్డి నిర్వహించడం జరిగింది ఉద్యాన అధికారి జయ భరత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో బొగ్గు నిల్వలు తగ్గుతున్న నేపధ్యం లో వెదురు సాగు వైపు మొగ్గు చూపాలని రైతు సోదరులను విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమం లో కడప ఉద్యాన అధికారి రెడ్డయ్య మాట్లాడుతూ అరటి, టమాటా పోట్లకు పోటీలకు, పేపర్ తయారీకి, హస్తకళా ఉత్పత్తులకు వెదురు చాల అనుకూలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, బొగ్గుడి వారిపల్లి పరిధిలోని రైతులు, రైతు సేవ సిబ్బంది ప్రియదర్శిని, ప్రేమ్ సందీప్ పాల్గొన్నారు.



# చదువుతో పాటు క్రీడలో రాణించాలి




రాయచోటి టౌన్ ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

యువత చదువుతోపాటు క్రీడల్లో విశేషంగా రాణించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆర్పిఎల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి ఆర్గనైజర్లు ఘన స్వాగతం పలికారు. ఫైనల్ మ్యాచ్లో గెలుపొందిన విన్నర్, రన్నర్లకు ట్రోఫీలతో పాటు ప్రైజ్ మనీలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం క్రీడలు ప్రోత్సహించేలా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. రాయచోటిలో త్వరలో అత్యాధునిక హంగులతో క్రీడామైదానం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నెలరోజుల పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో క్రీడాకారులలో క్రీడా నైపుణ్యం పెంపొందించేలా క్రికెట్ క్రీడలను ఏర్పాటు చేసిన ఆర్గనైజర్ లను వారు ప్రత్యేకంగా అభినందించారు

# ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి



చిన్నమండెం పిబ్రవరి 4 ప్రబాతవార్త:

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం చిన్నమండెం మండలం, బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరిస్తూ వారి విన్నపాలు వింటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలన్ని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల సమైక్య కృషితో మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిద్దాం

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 04 ప్రభాతవార్త

అన్ని శాఖల అధికారులు సమైక్య కృషితో మండలాన్ని అభివృద్ధి బాటిల్ నడిపించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిళ్ళై పేర్కొన్నారు. సంపూర్ణ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీవో సభా భవనం నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జె డి గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలు అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి ఆ గ్రామాలను అభివృద్ధి చేయాల లక్ష్యంతో సంపూర్ణ అభియాన్ 2.0 ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా అధికారులు అంగన్వాడి కేంద్రాలలో చిన్న పిల్లలకు శుద్ధి చేసిన నీటిని అందించాలి మంచి పౌష్టికాహార అందించాలి వారి బరువు ఎదుగుదలను గుర్తించాలన్నారు. ఎంపీడీవో రెడ్డయ్య మాట్లాడుతూ వేసవి సమీపిస్తుందని గ్రామాలలో త్రాగునీటి సమస్య రోడ్డు ఇతర సమస్యలను గుర్తించి అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. సమిష్ఠ కృషితో ప్రతి అధికారి పని చేస్తే ఆ గ్రామము మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. అంతే కాకుండా గ్రామాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం త్రాగునీటి సమస్య తీర్చడం విద్యుత్తు దీపాలు అమర్చడం ఎన్నో ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల దృష్టికి తీసుకెళ్లి ఆ గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ జహారాభి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చిన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిలో పెట్టి వారి పాలన ఎదుగుదలకు సమిష్టి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో శుద్ధి చేసిన నీటిని విద్యార్థులకు



అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం మంచి భోజనం తో పాటు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. అగ్రికల్చర్ ఏడిఏ జయరాణి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అధిక సంఖ్యలో రాణించాలని ప్రతి రైతు ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు సబ్సిడీ ఎరువులు సభ్యులు చేసుకొని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. సంపూర్ణ అభియోగ్ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మూడు మండలాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించాలని ఈ మండలాలను అభివృద్ధి కి ప్రతి ఒక్కరు కృషి కావాలన్నారు. గతేడాది అభివృద్ధిలో తృతీయ స్థానంలో ఉన్నామని జరిగే ఆరు నెలల్లో ప్రథమ స్థానం రావాలని ప్రతి ఒక్కరూ కష్టపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గుర్రంకొండ శోభ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఏపీఎం నిరంజన్, పశు సంవర్ధక అధికారి మహేష్, ఆర్డబ్ల్యూఓజెఈ కిషోర్, ఎంఈవో 2 వెంకట సుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# బి కొత్తకోట ఎంపిపి ఎన్నిక వాయిదా

### కోరం లేకపోవడంతో రేపటికి వాయిదా.

బి.కొత్తకోట. ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ః

బి కొత్తకోట మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు ఎన్నిక బుధవారం జరగాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో డి ఎల్ డి వో అమరనాథ్ రెడ్డి ఎంపీపీ ఎన్నిక గురువారానికి వాయిదా వేశారు. రెండు నెలల క్రితం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మండల పరిషత్ లో అవిశ్వాసం కోల్పోయి పదవి నుండి తొలగింపబడ్డారు. బి కొత్తకోట ఎంపీపీ పదవి ఎస్సి రిజర్వు కావడంతో ఎన్నిక ఆగిపోయింది. ఎంపీపీ ఎన్నిక ఈనెల 4 లేదా 5వ తేదీ నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఎన్నికల అధికారి డి ఎల్ డి ఓ అమరనాథరెడ్డి ఎన్నికల సమయానికి ఎవరు నామినేషన్ వేయకపోవడంతో గురువారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపి గురువారం సైతం ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయితే ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విలేకరులకు తెలిపారు.

# ఆరోగ్యకర జీవనశైలి ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

పీలేరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:

ఆరోగ్యకర జీవనశైలి ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని పి హెచ్ సి తలుపుల వైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. ప్రపంచ క్యాన్సర్ వ్యాధి దినోత్సవ సందర్భంగా తలుపుల జిల్లాపరిషద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వారి సిబ్బందితో కలిసి "క్యాన్సర్ అంటువ్యాధి కాదు" అంశంపై అవగాహన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. క్యాన్సర్ యొక్క తొలి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన వ్యాధి నిర్ధారణకై ఆరోగ్య పరీక్షలు అవసరమని, ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా, దురఅలవాట్లకు దూరంగావుండి, తరచు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని, క్రొవ్వుపదార్థాల మోతాదు తగ్గించి, పీచును పెంచుకోవాలని. సంబందిత టీకాలకు అధిక ప్రాధాన్యతనిస్తు, మంచి ఆలోచనలకు చేయూత నివ్వాలని శ్రీగిరీష అన్నారు, ఆ తర్వాత ప్రతిజ్ఞ మరియు విద్యార్థులచే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి హెచ్ఇఓ కొండయ్య, హెచ్‌యం రెడ్డెప్ప, ఉపాధ్యాయులు, ప్రమీల, కృష్ణమ్మ, కుముద, లావణ్య, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఐసిలో విజేతలుగా అక్షర విద్యార్థులు

నందలూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :




జాతీయస్థాయిలో జరిగే ప్రతిష్టాత్మక నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్ఎస్ఐసి) 2026 కాంపిటేషన్ లో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు వరుసగా 3వ సారి విజయం సాధించారు. ఈ విషయాన్ని బుధవారం ఆ పాఠశాల చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్ విలేకర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం గొబ్బిళ్ల అక్షర స్కూల్ నుంచి వివిధ విభాగాలలో 3 టీమ్స్ ఫైనల్స్ కి చేరాయని పేర్కొన్నారు. అందులో చిన్నారులు సాయి ఈశ్వర్, దీపక్ రాయల్ టీమ్ ఫైనల్స్ లో విన్నర్స్ గా నిలిచారని, వినయ శ్రీ, లేఖన టీమ్, గురు అక్షిత, హేమశ్రీ టీమ్ లు రన్నర్స్ గా నిలిచారని తెలిపారు. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ లో భాగంగా 1874 టీమ్స్ పాల్గొనగా 660 టీమ్స్ ఫేస్ 1 లో సెలెక్ట్ అయ్యాయని చెప్పారు. సెమీ ఫైనల్స్ లో 330 టీమ్స్ పాల్గొనగా ప్రీ ఫైనల్స్ లో 60 టీమ్స్ పాల్గొని 15 టీమ్స్ ఫైనల్స్ కి సెలెక్ట్ అయ్యాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఫైనల్స్ లో పాల్గొన్న విద్యార్థులతో పోటీపడి అద్వితీయమైన విజయం సాధించిన విద్యార్థులకు గొబ్బిళ్ల త్రినాథ్ అభినందనలు తెలిపారు. ఇంతటి విజయం సాధించడానికి కృషి చేసిన మెంటార్ వరప్రసాద్ కు, అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మొదటి దశలో గుర్తిస్తే క్యాన్సర్ నయం. డాక్టర్ ఆదర్శరెడ్డి

కురబలకోట ఫిబ్రవరి 4 ప్రభాతవార్త.

మండలం అంగళ్లకు సమీపంలో గల మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు ఇండస్ట్రీ రిలేషన్స్ సెల్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మదనపల్లి స్వస్థత హాస్పిటల్, చిన్న పిల్లల వైద్యుడు ఆదర్శ్ రెడ్డి పాల్గొని, విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుండగా భారత్‌లో అధికంగా ఉండడం ఆందోళనకరమని, జీవనశైలి మార్పులు, జంక్ ఫుడ్, మధుపానం, మద్యపానం, పొగత్రాగడం, అధిక ఒత్తిడి, సరైన వ్యాయామం లేకపోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటి అలవాట్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని తెలిపారు. క్యాన్సర్ గొంతు, ఊపిరితిత్తులు, చర్మం, ఉదరం, బ్రెస్ట్ వంటి శరీర భాగాలకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, అయితే మొదటి దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్యాన్సర్ నాలుగు దశల్లో ఉంటుందని, ప్రారంభ దశలో చికిత్స పొందితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని పేర్కొంటూ తమ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగులకు ప్రత్యేక సదస్సులు, చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ఎక్కువ కాలం ప్లాస్టిక్ వినియోగం చేయడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారని. కాబట్టి ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల వాడకాన్ని తగ్గించి, స్టీల్ లేదా గాజు పాత్రలను ఉపయోగించడం, ప్లాస్టిక్‌లో వేడి ఆహారం పెట్టకపోవడం, ప్లాస్టిక్‌ను కాల్చకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే మన భవిష్యత్తు తరాల వారిని క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా చూసుకోవచ్చని తెలిపారు. స్వస్థత హాస్పిటల్‌తో మిట్స్ యూనివర్సిటీ కుదుర్చుకున్న ఎంఓయూలో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అసిస్టెంట్ డైరెక్టర్, ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ పి.ఎం. బాలాజీ, డాక్టర్ ఆర్. చెన్నయ్య , కోఆర్డినేటర్లు జి. కుమార్, డాక్టర్ బి. సింహాద్రి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న దృశ్యం

# క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

వీరపునాయుని పల్లి ఫిబ్రవరి 04 ప్రభాతవార్త.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బుధవారం ఉదయం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు క్యాన్సర్‌పై అవగాహన వీడియోలను ప్రదర్శించి, లక్షణాలు, నివారణ, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను వివరించారు. మండల వైద్యాధికారి మొహమ్మద్ తాహా మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయి చికిత్స సాధ్యమవుతుందని, ముఖ్యంగా గర్భాశయ ముఖ క్యాన్సర్ స్క్రీనింగ్ ఎంతో కీలకమని తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలకు ఫీల్డ్ స్టాఫ్ ద్వారా ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కోసం ఆహ్వాన పత్రాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని పాఠశాలలు, గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ అవగాహన సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాష ఆయుర్వేద వైద్యాధికారి డా. శ్రీకాంత్, సిహెచ్ఓ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ మేరీ సువర్ణ, సూపర్వైజర్ యోగీశ్వరయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలలలో వార్షికోత్సవ వేడుకలు

రామసముద్రం పిబ్రవరి 4 ప్రభాతవార్త



మండలంలోని ఉలపాడు గ్రామ పంచాయతీ దిన్నిపల్లె సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా స్కూల్ చైర్మన్ బాలాజీ, టిడిపి సీనియర్ నాయకులు సీతారామయ్య, గుండ్ల పల్లె శివారెడ్డి స్వామి, మాలమహానాడు అధ్యక్షులు కృష్ణప్ప, హెచ్ ఎం చిట్టి బాబు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టిబాబు, టిడిపి నాయకులు శ్రీనివాసులు, వాహీద్, సుబ్బు వీరిని ఉపాధ్యాయులు విద్యార్తులు సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభం చేశారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. చెడు అలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పాఠశాల వార్షికోత్సవం లో పాల్గొన్నా జయసుధ, నాగరాజు,లక్ష్మి, విజయలక్ష్మి,ఇందిరా, హసీనా, హరికృష్ణ, జాబీ, దేవా, నాగ చరిత్, ఉస్మాన్ వల్లి, నిర్మల, వెంకటేష్, ఆనంద్, సుబ్బు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



మైదుకూరు, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆర్థిక పరమైన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 10 వ తేదీన కడప కలక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎస్.టి.యు మైదుకూరు రీజియన్ కన్వీనర్ రమణయ్య కోరారు.స్థానిక మండల వనరుల కేంద్రంలో జరిగిన రీజియన్ పరిధిలోని ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల కు రావలసిన 30 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాలని మరియు పీఆర్సీ కమిటీని నియమించి ,30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రిటైర్డు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గాలకు ఇవ్వాల్సిన ప్రావిడెంట్ ఫండ్ మరియు ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్స్ త్వరగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు ఆలస్యం లేకుండా త్వరితగతిన చేపట్టాలని తెలిపారు.2003 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు నాయకులు ఈశ్వరయ్య, మీర్ సాబ్,తుపాకుల సుబ్బరాయుడు,విజయ్ నరసింహ రాజు, రవింద్రారెడ్డి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు వర్గాల మధ్య స్థల వివాదం..

### సిఐ జోక్యంతో పరిష్కారం

రాజుపాళెం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో రెండు వర్గాల మధ్య స్థల వివాదం తలెత్తడంతో అది కాస్త పంతాలు, పట్టింపులకు పోయి వర్గ విభేదాలు తలెత్తకముందే సిఐ నాగభూషణం తన సిబ్బందితో గ్రామంలోని వివాద స్థలమును బుధవారం సాయంత్రం పరిశీలించి రెండు వర్గాల వారిని పిలిచి సామరస్యంగా పరిష్కరించారు. దీంతో గ్రామంలో ఎటువంటి సమస్యకు తావు లేకుండా రెవిన్యూ అధికారులతో చర్చించి రెండు వర్గాల పెద్దమనుషులను కూర్చోబెట్టుకొని స్థలం వివాదం పూర్తిస్థాయిలో పరిష్కరించి రెండురోజుల్లో ఎవరిది వారికి కేటాయిస్తామని రెండు వర్గాల వారిని ఆయన ఒప్పించారు. దీంతో రెండు వర్గాల పెద్ద మనుషులు సమ్మతించి ఒప్పుకోవడం జరిగినది. ఈ సమస్య పైన తహసిల్దార్ మనోహర్ రెడ్డి తన సిబ్బందితో బుధవారం ఉదయం వివాద స్థలములు కూడా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్, వీఆర్వో అశోక్, గ్రామ కావలి సంఘం పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లెపెరెడ్డిపల్లిలో రైతు సదస్సు విజయవంతం




పులివెందుల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :

పులివెందుల మండలం నల్లెపెరెడ్డిపల్లి గ్రామంలో అరటి పరిశోధనా కేంద్రం, పులివెందుల ఆధ్వర్యంలో రైతు సదస్సు మరియు అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కడిరి బాబు రావు డిగ్రీ కళాశాల, సి.ఎస్.పురం, కనిగిరి లోని ఆర్ హెచ్ డబ్ల్యుఈపి విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అరటి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. వి.ఎన్.పి. శివరామకృష్ణ, ఉద్యానవన శాఖాధికారి రాఘవేంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక అరటి సాగు పద్ధతులు, పంటల ఉత్పత్తి పెంపు మార్గాలు, రోగ నివారణ చర్యలు మరియు ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. కడిరి బాబు రావు డిగ్రీ కళాశాల డీన్ డా. వియన్న గౌడ్, ఆర్ హెచ్ డబ్ల్యుఈపి ఇన్‌చార్జ్ అఖిల్ బాబు, ఓ.ఏ.ఎం. భరత్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆర్ హెచ్ డబ్ల్యుఈపి ద్వారా విద్యార్థులు పొందుతున్న గ్రామీణ అనుభవాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రైతులు తమ సాగు అనుభవాలను పంచుకోగా, విద్యార్థులు ఆర్ హెచ్ డబ్ల్యుఈపి ద్వారా పొందిన అనుభ వాలను వివరించారు. ఈ రైతు సదస్సు రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## కుంకుమ శోభిత జననీ

# అమ్మా భవానీ బోయకొండ గంగమ్మ తల్లీ..

### -కన్నుల పండుగలా పుష్పాలంకరణ

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

విశ్వవసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం, సప్తమిన శక్తిక్షేత్రం బోయకొండపై లక్షకుంకుమార్చనను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రధాన ఆలయాల్లోని అమ్మవార్లకు నిర్వహించిన పుష్పాలంకరణ భక్తులను ముగ్ధలను చేసింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులు గోవర్ధనశర్మ, గంగిరెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, పుష్పాలంకరణగావించారు. ఆవరణంలో ఉత్సవ విగ్రహాన్ని వుంచి దంపతుల సమక్షంలో లక్షకుంకుమార్చనను ప్రారంభించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమాది కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులకు ఉచిత అన్నప్రసాదమందించారు.

### విశేష స్పందన :

లక్ష కుంకుమార్చనకు దంపతుల నుంచి విశేష స్పందన లభించింది. 3రోజుల పాటు నిర్వహించే కుంకుమార్చనకు తొలి రోజు బుధవారం 122మందికి పైగా దంపతులు పాల్గొన్నారు. అర్చనానంతరం ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వారిని దుశ్శాలవాలతో సత్కరించి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.



గంగమ్మ ఆలయంలో జరుగుతున్న కుంకుమార్చన దృశ్యం

# ఆరోగ్యకర జీవనశైలితోనే క్యాన్సర్ నియంత్రణ



మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త.

ఆరోగ్యకర జీవనశైలితోనే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఏడాది దాదాపు 35 వేల క్యాన్సర్ కేసులు కొత్తగా నమోదు అవుతున్నాయన్నారు. క్యాన్సర్ నియంత్రణ కోసం అన్నమయ్య జిల్లాలో గత ఏడాది నవంబర్ 15 నుంచి ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ఎన్సీడి 4.0 నిర్వహిస్తున్నామన్నారు. గుట్కా, పొగాకు, మద్యపానం సేవించడం, ఎక్కువగా గర్భ నిరోధక మాత్రలు మింగడం వల్ల, వ్యాధినిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు. జిల్లా ఎన్సీడీ అధికారి శివ ప్రతాప్ మాట్లాడు తూ 14ఏళ్లు నిండిన అమ్మాయిలకు భవిష్యత్ లో గర్భశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఇమ్యూనిటీ పెంచడానికి హెచ్. పీ.వి.వ్యాక్సిన్ ఇవ్వాలని, ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, తొందరలో వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ముందస్తు పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. అనంతరం సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా టి. బి. అధికారి డాక్టర్ రాధిక, ఏ. ఓ. మధుసూదన్ రెడ్డి, 104నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, డి. ఎమ్. ఓ. రామ చంద్ర రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి పాలనలోనే రైతులకు న్యాయం

బద్వేలు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 12 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ వినియోగించినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు కేవలం 2,000 కోట్ల రూపాయలే కేటాయించారని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ రితేష్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి పెద్ద చెరువును పరిశీలించారు. మట్టి, ఇసుక దోపిడీపైనే అప్పటి ప్రభుత్వం దృష్టి పెట్టి, సీమ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, కేవలం 19 నెలల్లోనే రాయలసీమ ప్రాజెక్టుల కోసం 8,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పనులను వేగవంతం చేస్తోందని రితేష్ రెడ్డి తెలిపారు. రాయలసీమను 'రత్నాల సీమ'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ అధినేత జగన్ రెడ్డి చేపడుతున్న దీక్షలు, ఆందోళనలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలేనని, వాటిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని రితేష్ రెడ్డి స్పష్టం చేశారు.



# అమ్మవారిశాలలో గీత జ్ఞాన యజ్ఞం ప్రవచనాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

స్థానిక మెయిన్ బజార్ లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానం (అమ్మవారిశాల)లో ఫిబ్రవరి 7,8 తేదీలలో గీతాజ్ఞాన యజ్ఞం ప్రవచనాలు జరుగుతాయని ఆర్యవైశ్య సభ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శనివారం, ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత మరియు భగవద్గీత ఫౌండేషన్ చైర్మెన్ అయిన బ్రహ్మశ్రీ డాక్టర్ యల్. వి. గంగాధర శాస్త్రి ఆధ్వర్యంలో గీత జ్ఞాన యజ్ఞం నిత్య జీవితంలో భగవద్గీత, ఘంటశాల భక్తి గీతాలు, అన్నమాచార్య కీర్తనలు, విశ్వరూప దర్శన యోగంపై విశేష ప్రవచనాలు జరుగుతాయని వివరించారు.